

ఒక్క రోజు.. రూ.6.70 లక్షలు
బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన శ్రీలక్ష్మి గణమద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్క రోజు రూ.6,70,791 ఆదాయం వచ్చింది.



ట'మాట' పడిపోకుండా..
జిల్లా పశ్చిమ ప్రాంత రైతుల కల నెరవేరుతోంది. సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 8లో▸



వేసవిలో వర్షపు జల్లులు
ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు చిరు జల్లులు మొదలు కొని ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. 8లో▸

సాక్షి
కర్నూలు
ఆదివారం । 21 । ఏప్రిల్ । 2024

న్యూస్‌రీల్

నేడు 'మోడల్' ప్రవేశ పరీక్ష

కర్నూలు సిటీ: ఏపీ మోడల్ స్కూళ్లలో 6వ తరగతి ప్రవేశాలకు ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. జిల్లాలోని 16 మోడల్ స్కూళ్లలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తెలుగు, ఇంగ్లిషు మీడియంలలో పరీక్ష జరపనున్నారు. ఒక్కో స్కూల్‌లో 80 సీట్లు ఉండగా.. ప్రవేశాలకు ఎక్కువ మంది పోటీ పడుతున్న స్కూల్లో అదనంగా 25 శాతం సీట్లు పెంచుకునే సదుపాయాన్ని కల్పించారు. ఈ స్కూళ్లలో ఇంగ్లిషు మీడియంతో పాటు సీబీఎస్‌ఈ సిలబస్‌ను అమలు చేస్తున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

కర్నూలు(అగ్రికల్చర్): ఎండలు, వడగాల్పుల తీవ్రతతో గృహ విద్యుత్ వినియోగం పెరిగింది. దీంతో ఫీడర్లలో లోడ్ రెట్టింపు అయ్యింది. లో వోల్టేజీ, హైవోల్టేజి సమస్యలు రాకుండా విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన లోడ్ డైవర్షిఫికేషన్ పనులు చేపట్టారు. ఇందుకు ఒక కిలోమీటరుకు రూ.15 లక్షల వ్యయం చేస్తున్నారు. 2023 ఏప్రిల్ 19న రేడియో స్టేషన్ ఫీడర్‌లో 126 యామ్స్ లోడు ఉంది. ఈ నెల 19న ఇదే ఫీడర్‌లో 174.2 యామ్స్‌కు లోడ్ పెరిగింది. ఇటువంటి ఫీడర్‌లు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయని, సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎం.ఉమాపతి తెలిపారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



అగ్నిప్రమాదాలపై నర్సింగ్ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కర్నూలు : అగ్నిప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 14వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ఆ శాఖ అగ్నిమాపక శాఖ వారోత్సవాలను నిర్వహించింది. ఇందులో భాగంగా 7వ రోజు సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి చిన్నబజారి ఆధ్వర్యంలో కర్నూలులోని సప్తగిరి నగర్‌లో ఉన్న అగ్నిమాపక కేంద్రం నందు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రభుత్వ నర్సింగ్ కాలేజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అగ్నిప్రమాదాలు, వంట గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా రక్షించుకోవాలి అనే అంశంపై డెమో రూపంలో వారి చేసి చూపించారు. అలాగే ప్రకృతి విపత్తులు, సునామీలు సంభవించినప్పుడు మనలను మనం ఎలా కాపాడుకోవాలనే విషయాలను వివరించారు.

పరీక్ష ఫీజు చెల్లించేందుకు 24న ఆఖరు

నంద్యాల(న్యూటౌన్): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించేందుకు ఈనెల 24వ తేదీతో గడువు ముగుస్తుందని, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఫీజు చెల్లించాలని డీవీఈఓ సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్, దరఖాస్తు చేసుకొనే విద్యార్థులు కూడా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రీవెరిఫికేషన్‌కు రూ.1,300, రీకౌంటింగ్‌కు రూ.260 చెల్లించాలన్నారు. జనరల్ వృత్తి విద్యాకోర్సుల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు రూ.550 చెల్లించాలన్నారు. ప్రాక్టికల్స్‌కు రూ.250, బ్రిడ్జి కోర్సు పరీక్ష రాసేందుకు రూ.150 చెల్లించాలన్నారు. ఇంప్రూమెంట్ రాసే విద్యార్థులు పరీక్ష ఫీజుతో పాటు ఒక్కో పేపర్‌కు రూ.160 చెల్లించాలన్నారు. ప్రాక్టికల్ పరీక్షలు మే 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు, సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరుగుతున్నాయన్నారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ వ్యాక్సిన్ వేయాలి

కర్నూలు(హాస్పిటల్): అర్హులైన గర్భిణి, చిన్నారులకు ప్రతి ఒక్కరికీ వ్యా క్సిన్ వేయించాలని డీఎంహెచ్ఓ డాక్ట ర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన నగరంలోని డాక్టర్స్ కాలనీ, ఎ.క్యాంపులోని అర్బన్ హెల్త్ సెంటర్లలో నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌ను, వ్యాక్సినేషన్ స్టోరేజ్ కోల్డ్ చైల్ట్ మెయింటెనెన్స్‌ను తనిఖీ చేశారు. అక్కడికి వచ్చిన పిల్లలందరికీ డ్యూ లిస్ట్ ప్రకారం వ్యాక్సినేషన్ అందిస్తున్నారా లేదా అని, ఎంసీపీ కార్డులో వారి వివరాలు అన్నీ నమోదు చేస్తున్నారా అని ఆరా తీసి మళ్లీ రావాల్సిన తేది వారికి తప్పనిసరిగా చెప్పాలని చెప్పారు. గర్భిణులకు, బాలింతలకు పోషకాహార విలువల గురించి, వడదెబ్బకు గురిగాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అక్కడికి వచ్చిన ప్రజలందరికీ కూడా ఆరోగ్య విద్యా బోధన గురించి పోషకాహార విలువల గురించి, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలపాలని చెప్పారు.

పొత్తులు.. కత్తులు!

జిల్లాలో బీజేపీ, జనసేనతో టీడీపీకి పొసగని పొత్తు

- ఎమ్మిగనూరులో నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి మురహరి రెడ్డి
- మంత్రాలయంలో నేడు నామినేషన్ వేయనున్న బీజేపీ అభ్యర్థి
- కోసిగిలో తిక్కారెడ్డి, రాఘవేంద్ర వర్గాల మధ్య ఘర్షణ
- ఆలూరులో చంద్రబాబు పర్యటనకు గుమ్మనూరు జయరాం డుమ్మా
- నంద్యాలలో ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసే యోచనలో భూమా బ్రహ్మానందరెడ్డి
- ఆదోని, కోడుమూరు, డోన్‌లో అభ్యర్థులకు సహకరించని ఇన్‌చార్జ్‌లు



సార్వత్రిక పోరులో టీడీపీ, బీజేపీ, జనసేన కలహాల కాపురం చేస్తున్నాయా? సింహభాగం నియోజకవర్గాల్లో ఒకరికొకరు సహకరించుకునే పరిస్థితి లేదా? ఈ వైఖరితో ఈ దఫా ఎన్నికల్లోనైనా బోణి చేయాలనే కూటమి ఆశలు సన్నగిల్లుతున్నాయా? తాజా పరిస్థితులను బేరీజు వేస్తే అవుననే సమాధానం వస్తోంది. 'కూటమి' పొత్తు ధర్మాన్ని వీడి బీజేపీ అభ్యర్థులు నామినేషన్లకు సిద్ధమైతే, వారికి జనసేన నేతలు మద్దతుగా నిలుస్తున్నారు. దీనికి తోడు టిక్కెట్ రాక నిరాశతో ఉన్న ఇన్‌చార్జ్‌లు అభ్యర్థులకు సహకరించకుండా మిన్నకుండిపోతున్నారు. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో రెండు జిల్లాల్లో సైకిల్ జర్నీ అతి కష్టంగా మారింది.

– సాక్షిప్రతినిధి కర్నూలు



ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాల్లో అసెంబ్లీ, పార్లమెంట్‌లో టీడీపీ ప్రాతినిధ్యం లేదు. గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్‌స్వీప్ చేయడంతో టీడీపీ ఉనికి లేకుండా పోయింది. ఈ దఫా ఎన్నికల్లో తమ బలం సరిపోక బీజేపీ, జనసేనతో టీడీపీ పొత్తు పెట్టుకుంది. 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. ఆదోని నుంచి బీజేపీ పోటీ చేస్తోంది. తక్కిన 13 స్థానాల్లో టీడీపీ పోటీలో ఉంది. జనసేన పరిస్థితి మరీ ఘోరం. రాయలసీమలోని 52 అసెంబ్లీ స్థానాల్లో తిరుపతి మినహా ఒక్కస్థానం నుంచి కూడా జనసేన అభ్యర్థులు పోటీలో లేరు. దీంతో లోలోన వీరిలో అసంతృప్తి రగులుతోంది. ఎన్నికలు దగ్గరపడే కొద్దీ ఒక్కో నియోజకవర్గంలో అసమ్మతి పెల్లుబుకుతోంది. ఎమ్మిగనూరులో టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే శుక్రవారం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మురహరిరెడ్డి బీజేపీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. జనసేన నేతలు కూడా నామినేషన్‌కు వెళ్లారు. దీంతో జయనాగేశ్వరరెడ్డికి సహకరించేది లేదని, పోటీలో తాము ఉన్నామని బీజేపీ, జనసేన స్పష్టం చేసినట్లయింది. అలాగే మంత్రాలయం టీడీపీ అభ్యర్థిగా రాఘవేంద్రను కూటమి ప్రకటించింది. అయితే ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా అర్లబండ రాముడు నామినేషన్ వేస్తారని మంత్రాలయం బీజేపీ ఇన్‌చార్జ్ పురుషోత్తంరెడ్డి ప్రకటించారు. నేడు లేదా రేపు రాముడు నామినేషన్ వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే నంద్యాలలో మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని కాదని ఫరూక్‌ను అభ్యర్థిగా టీడీపీ ప్రకటించింది. షెడ్యూల్ వెలువడిన రోజు నుంచి ఫరూక్ ప్రచారంలో పాల్గొనడం లేదా ఫరూక్‌కు ఓటెయ్యండని బ్రహ్మం ఎక్కడా చెప్పలేదు. ఫరూక్ నామినేషన్‌కు కూడా ఆయన గైర్హాజరయ్యారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్లు తెలుస్తోంది. మౌనంగా ఉండిపోతే తన రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంలో పడుతుందని, తన బలం ఏంటో పార్టీకి తెలియాలంటే పోటీ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు చర్చ జరుగుతోంది. అతని అనుచరులు కూడా పోటీ చేసి తమ బలం నిరూపించుకుందామని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది.

మంత్రాలయంలో తిక్కారెడ్డి, రాఘవేంద్ర వర్గాల బాహాబాహీ

మంత్రాలయంలో తిక్కారెడ్డిని కాదని రాఘవేంద్ర టిక్కెట్ దక్కించుకున్నారు. టిక్కెట్ కోసం తిక్కారెడ్డి తీవ్రంగా యత్నించారు. ఒక దశలో రాఘవేంద్ర అత్యంత బలహీన అభ్యర్థి అని, తిక్కారెడ్డికే టిక్కెట్ ఇవ్వాలని రాబిన్‌శర్మ చంద్రబాబుకు సూచించడంతో టిక్కెట్ మార్చాలనే చర్చ కూడా జరిగింది. కానీ బోయలకు టిక్కెట్ ఇచ్చి తిరిగి మారిస్తే జిల్లా మొత్తం ప్రభావం చూపుతుందని రాఘవేంద్రతోనే ఎన్నికలకు వెళుతున్నారు. తిక్కారెడ్డికి జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టారు. అయితే ఈ రెండు వర్గాల మధ్య సయోధ్య కుదరని పరిస్థితి. రాఘవేంద్ర ఓడిపోతే తిరిగి తానే మంత్రాలయం ఇన్‌చార్జ్‌గా ఉంటానని, గెలిస్తే తనకు రాజకీయ భవిష్యత్ ఉండదనే యోచనలో తిక్కారెడ్డి ఉన్నారు. దీంతో రాఘవేంద్రకు సహకరించడం లేదని తెలుస్తోంది. పార్టీ కేడర్ కూడా ఎక్కడా కలిసి పనిచేసే పరిస్థితి లేదు. కోసిగిలో శనివారం తిక్కారెడ్డితో ఉన్న అయ్యన్న వర్గం రాఘవేంద్ర వద్దకు వస్తుంటే.. రాఘవేంద్ర వర్గీయులు చిన్నతాయన్న, రంగడు ఒప్పుకోలేదు. దీంతో రెండు వర్గాలు బాహాబాహీకి దిగాయి. కనీసం దీన్ని నివారించే ప్రయత్నం కూడా రాఘవేంద్ర చేయలేదు. ఇంత బలహీనమైన అభ్యర్థితో ఎన్నికలకు వెళ్లడం ఇష్టం లేకనే బీజేపీ బరిలో ఉండేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

ముఖం చాటేసిన గుమ్మనూరు

మిగతా నియోజకవర్గాల్లో ఎలాగున్నా ఆలూరులో పరిస్థితి మరింత భిన్నంగా ఉంది. స్వయంగా పార్టీ అధినేత చంద్రబాబు పర్యటనకు వచ్చినా ఆ పార్టీ నేత, స్థానిక ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ముఖం చాటేయడం చర్చనీయాంశంగా మారింది. నిన్న మొన్నటి వరకు ఇతనికి టిక్కెట్ వస్తుందా, రాదా అన్న మీమాంస కొనసాగింది. చివరకు కిందా మీదా పడి గుంతకల్లు టిక్కెట్ దక్కించుకున్నా.. చంద్రబాబు ఆలూరు పర్యటనకు గుమ్మనూరు దూరంగా ఉండటం ఆ పార్టీ నేతల్లో ఆసక్తికర చర్చకు తావిచ్చింది. ఊళ్లోనే ఉన్నప్పటికీ కార్యక్రమానికి గైర్హాజరు అవడం చూస్తే.. పార్టీ ప్రకటించిన అభ్యర్థికి ఏమాత్రం సహకరిస్తాడో అర్థమవుతోంది.

ఆదోని, డోన్, కోడుమూరులో ఎన్నికలకు దూరంగా ఇన్‌చార్జ్‌లు

ఆదోనిలో బీజేపీ అభ్యర్థిగా పార్థసారథి నామినేషన్ వేశారు. అయితే ఇక్కడ టిక్కెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఇతనికి ఏమాత్రం సహకరించని పరిస్థితి. నామినేషన్‌కు కూడా బలవంతంగా వెళ్లినట్లు తెలుస్తోంది. జనసేన నేతలు పూర్తి దూరంగా ఉండిపోయారు. డోన్‌లో ధర్మవరం సుబ్బారెడ్డిని కాదని కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి టిక్కెట్ ఇచ్చారు. ఇక్కడ సుబ్బారెడ్డి ప్రచారంలో పాల్గొనడం లేదు. వీరి మధ్య సయోధ్య కుదిరినట్లు చెబుతున్నా సుబ్బారెడ్డి అన్యమనస్కంగానే ఉన్నారు. అలాగే కచ్చితంగా కేఈ కుటుంబం డోన్ నుంచి పోటీలో ఉంటుందని బీరాలు పలికిన కేఈ ప్రభాకర్ పత్తా లేకుండా పోయారు. టిక్కెట్ ప్రకటన తర్వాత డోన్ వైపు చూడలేదు. అలాగనీ కోట్లకు కూడా సహకరిచడం లేదు. పత్తికొండలో కూడా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. డోన్‌లో ప్రభాకర్‌కు బలమైన వర్గం ఉంది. వీరంతా కూడా కోట్లకు సహకరించడం లేదు. కేఈ కృష్ణమూర్తి వచ్చి ఒకరోజు ప్రెస్‌మీట్ పెట్టడం మినహా ప్రభాకర్ ఒక్క రోజు కూడా కోట్లతో కలిసి డోన్‌లో కార్యక్రమం నిర్వహించలేదు. అలాగే కోడుమూరులో దస్తగిరికి మద్దతుగా ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రచారం కూడా చేయడం లేదు. ఇంటికే పరిమితమయ్యారు. దీంతో దస్తగిరి సార్వత్రిక పోరులో ఎదురీదుతున్నారు. ఇదే సమయంలో ఆకేపోగు ప్రభాకర్ కూడా సహకరించకపోవడం గమనార్హం.

మీకు తెలుసా..

72 ఏళ్లలో 79 శాతం పెరిగిన ఓటర్లు



కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 72 సంవత్సరాల్లో 79 శాతం ఓటర్లు పెరిగారు. 1952లో కర్నూలు పార్లమెంట్ స్థానం ఏర్పాటైంది. అప్పట్లో కర్నూలు పార్లమెంట్ పరిధిలో మొత్తం 3,54,775 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం ఈ సంఖ్య 16,92,300కు చేరుకుంది. ఈ స్థానానికి ఇప్పటి వరకు (1994లో జరిగిన ఉప ఎన్నిక మినహాయిస్తే) 17 పర్యాయాలు సాధారణ ఎన్నికలు జరిగాయి. ఉప ఎన్నికను కలుపుకొని కర్నూలు పార్లమెంట్‌కు 18 సార్లు జరిగిన ఎన్నికల్లో 10 సార్లు కోట్ల కుటుంబానికి చెందిన వారు ఎంపీలుగా ఎన్నికయ్యారు. ఇందులో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఆరు సార్లు, కోట్ల కోదండ రామిరెడ్డి ఒక పర్యాయం, కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మూడు సార్లు ఎంపీగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పార్టీ ఆవిర్భావం అనంతరం 2014, 2019లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఈ స్థానం నుంచి రెండు పర్యాయాలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. ఇప్పటి వరకు ఈ స్థానం నుంచి రెండు సార్లు మాత్రమే మహిళలు పార్లమెంట్ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1962లో యశోదారెడ్డి ఎంపీగా ఎంపిక అనంతరం ఐదు దశాబ్దాలుగా ఏ రాజకీయ పార్టీ కూడా మహిళలకు ఎంపీ టికెట్ ఇచ్చిన పాపాన పోలేదు. 52 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం వైఎస్సార్‌సీపీ ఈ స్థానాన్ని మహిళలకు కేటాయించి తీసుకున్న సాహసోపేత నిర్ణయం వల్ల 2014లో బుట్టా రేణుక విజయం సాధించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర బడుగు, బలహీన వర్గాలకు రాజకీయంగా చేయూతను ఇస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2014 నుంచి ఇప్పటి వరకు మూడు సార్లు ఈ స్థానాన్ని బీసీ వర్గాలకే కేటాయించారు.

– కర్నూలు(అర్బన్)

మూడో రోజు 9 నామినేషన్లు

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మూడో రోజు శనివారం తొమ్మిది మంది అభ్యర్థులు తొమ్మిది సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బి.వీరభద్రగౌడ్, ఆయన కుమారుడు గిరి మల్లేష్ గౌడ్ నామినేషన్‌లు వేశారు. కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా రెడ్డిపోగు విజయభాస్కర్ నామినేషన్ దాఖలు చేశారు. కర్నూలు అసెంబ్లీ స్థానం నుంచి పులి జాకోబ్, సింగరి చంద్రశేఖర్ స్వతంత్ర అభ్యర్థులుగా, పత్తికొండ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కంగాటి రామ్మోహన్‌రెడ్డి రెండో సెట్ నామినేషన్‌ను వేశారు. కోడుమూరు నుంచి అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ అభ్యర్థిగా అండ మీనా కుమారి, వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా యాపదిన్నె పెద్ద మద్దిలేటి, ఎమ్మిగనూరులో గవ్వల నారాయణ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆదోని, పాణ్యం, మంత్రాలయం నియోజకవర్గాల నుంచి శనివారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. మూడు రోజుల్లో 39 మంది 45 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు నామినేషన్లకు విరామం

నామినేషన్లను ఈనెల 25వ తేదీ వరకు స్వీకరిస్తారు. అయితే ఇందులో ఆదివారాలు, ఇతర ప్రభుత్వ సెలవు రోజుల్లో స్వీకరించరు. ఈక్రమంలో నాలుగో రోజు ఆదివారం కావడంతో నామినేషన్లను స్వీకరించరు. 22 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతుంది.

పోస్టల్ బ్యాలెట్‌కు రేపే తుది గడువు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు ఏప్రిల్ 22వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వు, ఓటరు గుర్తింపు కార్డు జిరాక్స్ కాపీలతో కలిపి ఫారం–12ను అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వో కార్యాలయాల్లో అందజేయాలని సూచించారు. అత్యవసర సర్వీసుల్లో ఉన్న ఉద్యోగులు మాత్రం పోస్టు ద్వారా ఫారం–12 దరఖాస్తులను పంపవచ్చన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన



కర్నూలు(సెంట్రల్): పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం ఉదయం రిటర్నింగ్ అధికారులతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సీనియర్ సిటిజన్‌లు, పీడబ్ల్యూడీ, ట్రాన్స్‌జెండర్ ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్లు, బ్రెయిలీ స్క్రిప్టు, పోస్టర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా వర్గాల ఓటర్లకు తక్షణమైన సాయం అందించేందుకు హెల్ప్‌డెస్కను ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన ఓటర్లను వలంటీర్ల సాయంతో పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లాలని, ఇందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫారం–6, 8లకు సంబంధించి 7 రోజులు దాటిన దరఖాస్తులు 300 ఉన్నాయని, ఏడు రోజుల్లోపు ఉన్న దరఖాస్తులు 7 వేల వరకు ఉన్నాయని, వాటన్నింటినీ ఏప్రిల్ 22వ తేదీలోపు పరిష్కరించాలన్నారు. విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బందికి టీఏలు, డీఏలకు బడ్జెట్‌ను ఇచ్చామని, పోలింగ్ ముందు రోజునే డ్రా చేసుకొని సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన షెడ్లు, మంచినీటి వసతి, ఫర్నిచర్, బారికేడింగ్ ఏర్పాట్ల కోసం బడ్జెట్‌ను కేటాయించామన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో జేసీ నారపురెడ్డి మౌర్య, మునిసిపల్ కమిషనర్ భార్గవ్‌తేజ, ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పాల్గొన్నారు.

త్వరలోనే మొబైల్ రైతుబజార్ల ఏర్పాటు

- మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్ రెడ్డి



సి.క్యాంపు రైతుబజారులో తనిఖీలు చేస్తున్న మార్కెటింగ్ శాఖ డీడీ శ్రీకాంత్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): మొబైల్ రైతుబజార్లను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారిపై డోన్ రోడ్డులో అభివృద్ధి చెందుతున్న మయూరి గ్రీన్ ల్యాండ్, తిరుమలగిరి టౌన్‌షిప్‌ల వద్ద తొలుత ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. శనివారం ఆయన ఆయా టౌన్‌షిప్‌లకు వెళ్లి పరిశీలించి అక్కడి వారితో మొబైల్ రైతుబజార్ల ఏర్పాటుపై చర్చించారు. అంతకు ముందు డీడీ కర్నూలు సి.క్యాంపు రైతుబజారును తనిఖీ చేశారు. రైతులకు స్టాళ్లను ఏ విధంగా కేటాయిస్తున్నారనే దానిని పరిశీలించారు. పొదుపు మహిళలు ఇతరుల నుంచి బాడుగలు ఏ విధంగా వసూలు చేస్తున్నారనే దానిని అడిగి తెలుసుకున్నారు. రైతు బజారు ఆదాయం, వ్యయం తదితర వివరాలను ఆరా తీశారు. రైతులు, పొదుపు మహిళలతో మాట్లాడారు. సీ.క్యాంపు రైతుబజారుకు ప్రతి రోజు ముందు వచ్చిన రైతులకు వారు కోరిన విధంగా స్టాల్స్ కేటాయించాలని రైతుబజారు సిబ్బందిని ఆదేశించారు. రైతుబజారులో దళారీలకు తావు ఉండరాదని, ముందుగా వచ్చిన రైతులను గౌరవించాలని సూచించారు. అనంతరం మొబైల్ రైతుబజారు ఏర్పాట్లపై చర్చించారు. ఆయన వెంట మార్కెటింగ్ శాఖ అసిస్టెంటు డైరెక్టర్ నారాయణమూర్తి, సూపరింటెండెంటు సుజాత, హార్టీకల్చర్ కన్సల్‌టెంట్‌లు శివకుమార్, అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజారు ఎస్టేటు ఆఫీసర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బనవాసి కేవీకేలో మట్టి, నీటి పరీక్షలు


శాస్త్రవేత్త అశోక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో మట్టి, నీటి పరీక్షలు అందుబాటులో ఉన్నాయని కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులు తమ పొలాల్లోని మట్టి నమునా శాంపిల్స్ తీసుకువచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ పరీక్షలతో నేల ఆరోగ్య స్థితిని, పోషకాల లభ్యతను తెలుసుకోవచ్చన్నారు. పరీక్ష ఫలితాలను అనుసరించి ఏఏ పంటలు వేసుకోవాలి, ఎరువులు ఎంత మోతాదులో వాడాలి.. అనేది విషయాలపై శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు ఇస్తారన్నారు. నీటి పరీక్షలతో లవణ శాతం, ఉదజని సూచిక తెలుసుకోవచ్చన్నారు. మట్టి పరీక్ష ధర రూ. 100 (ఒక శాంపిల్‌కు), నీటి పరీక్ష ధర రూ. 60 (ఒక శాంపిల్‌కు) తీసుకుంటారని పేర్కొన్నారు. సందేహాలకు ప్రోగ్రాం అసిస్టెంట్(సాయిల్ టెస్టింగ్ ల్యాబ్) తేజకుమార్ 8074143694 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు.


ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనాలపై నిఘా ఉంచాం

కర్నూలు(అగ్రికల్చర్): సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న వేళ దొంగలు ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్, ఆయిల్ దొంగతనాలకు పాల్పడే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించినట్లు విద్యుత్ శాఖ విజిలెన్స్ సీఐ పార్థసారథిరెడ్డి తెలిపారు. ఇప్పుడు వాడుతున్న ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ ఉండటం లేదని, పాతవాటిపైనే దొంగల దృష్టి ఉండే అవకాశం ఉన్నందున వాటిపై నిఘ ఏర్పాట్లు చేసినట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దొంగలు కాపర్‌ను గుజరీ కింద అమ్మేందుకు యత్నిస్తారని, ఇందువల్ల గుజరీ అమ్మకాలపై కూడా నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు.

హనుమద్వాహనంపై రంగనాథుడు


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీరంగనాథస్వామి

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీరంగనాథుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం శ్రీ లక్ష్మీ రంగనాథుడు హనుమద్వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలతో అలంకరించి పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి హనుమంతుని ప్రతిమతో అలంకరించిన ప్రభోత్సవ వాహనం వద్దకు తెచ్చారు. అక్కడ ఆలయ ప్రధాన అర్చకుడు ఈశ్వరరెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు గోవిందనామస్మరణతో ప్రభోత్సవ వాహనాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గరుడవాహన సేవను నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వెంకటరమణ తెలిపారు.


హనుమద్వాహనాన్ని గ్రామ పురవీధుల్లో తిప్పుతున్న భక్తులు

ట‘మాట’ పడిపోకుండా..

- పత్తికొండలో రూ.12.05 కోట్లతో టమాట ప్రాసెసింగ్ యూనిట్
- హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్
- వేగంగా సాగుతున్న పనులు
- ఫలించని టీడీపీ నేతల కుటిల యత్నాలు
- సాకారమవుతున్న ఎన్నో ఏళ్ల కల


టమాట ప్రాసెసింగ్ యూనిట్ నిర్మాణపు పనులు జరుగుతున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా పశ్చిమ ప్రాంత రైతుల కల నెరవేరుతోంది. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుండటాన్ని జీర్ణించుకోలేని టీడీపీ నేతలు కుటిల యత్నాలు చేశారు. కొంతమందిని రెచ్చగొట్టి టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు కేటాయించిన భూములు తమకు వారసత్వంగా లభించాయంటూ.. కోర్టుల ద్వారా అడ్డుకునేందుకు యత్నించారు. భూములపై వారికి హక్కులు లేకపోయినప్పటికీ.. రెచ్చగొడుతూ పనులు ముందుకు సాగకుండా అడ్డుకునేందుకు టీడీపీ నేతలు తెర వెనుక ఉండి కథ నడిపించారు. కాంట్రాక్టరును సైతం బెదిరించారు. అయితే టీడీపీ నేతల యత్నాలు ఫలించడం లేదు. కోర్టులు కూడా తగిన ఉత్తర్వులు ఇవ్వడంతో అవరోధాలు లేకుండా పనులు జరుగుతున్నాయి.

ప్రత్యేక దృష్టి

2023–24 సంవత్సరానికి సంబంధించి మొదటి విడత వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడిసాయం విడుదల చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పత్తికొండకు వచ్చి టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, జిల్లా యంత్రాంగం, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి.. ఎలాంటి వివాదాలకు తావు లేని విధంగా భూమిని గుర్తించారు. ఆ భూమిని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీకి స్వాధీనం చేశారు. శంకుస్థాపన తదితర వన్నీ చకచక జరిగిపోయాయి. టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి పనులు కూడ చురుగ్గా జరుగుతున్నాయి. టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుతో వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందని టీడీపీ నేతలు అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. 2024–25 ఖరీఫ్‌లో టమాట పంట మార్కెట్‌కు వచ్చే నాటికి ప్రాసెసింగ్ యూనిట్‌ను పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు జరుతున్నాయి.

రూ.12.05 కోట్ల వ్యయం

టమాట ప్రాసెసింగ్ యూనిట్‌కు పత్తికొండ సమీపంలోనే జిల్లా యంత్రాంగం.. సర్వే నెంబరు 286/1ఏ3, 286/1ఏ4, 286/1ఏ5ల్లోని 3.60 ఎకరాల భూమిని కేటాయించింది. రూ.12.05 కోట్లతో టమాట ప్రాసెసింగ్ సెంటర్ నెలకొల్పనున్నారు. ఈ నిధులతో బిల్డింగ్ నిర్మాణంతోపాటు మిషనరీలు ఏర్పాటు చేస్తారు. ప్రతి నెలా 1200 టన్నులు, ఒక సీజన్‌లో 3,600 టన్ను ల టమాను ప్రాసెసింగ్ చేయనున్నారు.ప్రాసెసింగ్ యూనిట్ కార్యక్రమాలను 15 ఏళ్ల పాటు లీజ్ ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ ప్రాతిపదికన నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి బిడ్డింగ్ విధానంలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఎంపిక చేస్తుంది. టమాటకు అన్‌సీజన్ ఉన్నపుడు ఇతర పండ్లను కూడా ప్రాసెసింగ్ చేయడానికి చర్యలు తీసుకుంటారు. పత్తికొండ, ఆస్పరి, దేవనకొండ, ప్యాపిలి, కృష్ణగిరి, తుగ్గలి, పెద్దకడుబూరు, హాలహర్వి, ఆదోని, కోడుమూరు, ఓర్వకల్లు, కల్లూరు, వెల్దుర్తి తదితర మండలాల్లో టమాట విస్తారంగా సాగవుతోంది. ప్రతి ఏటా ధరలు పడిపోతుండటంతో టమాట పశువులకు వదిలేస్తున్న సంఘటలు చోటు చేసుకుంటున్నాయి. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు వల్ల రైతులకు ఎంతో మేలు జరగనుంది.

టమాట రైతులకు మంచి రోజులు


పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చిన టమాట

పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు అనేది దశాబ్దాల నాటి కల. ప్రతి ఎన్నికల్లోనూ టీడీపీ నేతలు టమాట ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై హామీలు గుప్పిస్తూ ఓట్లు పొందుతున్నారు. కాని కార్యరూపం దాల్చలేదు. టమాటకు గిట్టుబాటు ధర లభించక ప్రతి ఏటా రైతులు నష్టపోతూనే ఉన్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత టమాట రైతుల అభ్యున్నతికి చర్యలు చేపట్టింది. ప్రతి ఏటా ధరలు పడిపోయినపుడు మార్కెటింగ్ శాఖ అధికారులను రంగంలోకి దింపి వందలాది టన్నుల టమాట కొనుగోలు చేస్తోంది. ప్రస్తుతం ఏళ్లనాటి కలను నిజం చేస్తూ వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రాసెసింగ్ సెంటరు నెలకొల్పుతోంది. మరోవైపు వెజిటబుల్ సోలార్ డ్రైయర్లు పెద్ద ఎత్తున ఏర్పాటు చేస్తుండటం శుభపరిణామమే. టమాట పంట మార్కెట్‌లో ఎక్కువగా ఉండి ధరలు లేనపుడు సోలార్ డ్రైయర్లకు సరఫరా చేసి టమాట ఫ్లేక్స్ తయారు చేస్తారు. జిల్లాలో ఇప్పటికే 300 సోలార్ డ్రైయర్లు ఏర్పాటు అయ్యాయి. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో టమాట రైతులకు మంచి రోజులు వచ్చాయి.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


తాయప్ప (ఫైల్)

పత్తికొండ రూరల్: పట్టణంలోని రామకృష్ణారెడ్డి నగర్‌లో నివాసం ఉంటున్న తాయప్ప (35)శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈయన పత్తికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులోని కూరగాయల మండిలో హమాలీగా పనిచేస్తుండేవాడు. శుక్రవారం రాత్రి వర్షం రావడంతో ఇంటిమిద్దెపైన నీళ్లు నిలిచాయి. ఉదయం మిద్దెపైకి ఎక్కి నీటిని తొ లగిస్తుండగా విద్యుత్ తీగ తగిలి షాక్‌కు గురై అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య కమలాక్షి, కుమార్తెలు దిశ,హరిణి, కుమారుడు అఖిల్ ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఓర్వకల్లు: భార్య, కుమారుడు మృతి చెందడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గణపురం శంకరప్ప(35) భార్య, కుమారుడు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అప్పటి నుంచి శంకరప్ప తీవ్ర మనస్తాపంతో చెంది ఒంటరిగా ఉండేవాడు. శుక్రవారం జీవితంపై విరక్తి చెంది స్థానిక జగనన్న కాలనీలో ఓ చెట్టుకు ఉరేసు కుని మృతి చెందాడు. శనివారం పోలీసులు గ్రామానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. మృతుని తండ్రి నాగప్ప ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు.

మండు వేసవిలో వర్షపు జల్లులు

- కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు
- పిడుగు పాటుతో ఒకరు మృతి


బనగానపల్లె పట్టణంలో కురుస్తున్న వర్షం


తిమ్మాపురం పరిసరాల్లో నేలకొరిగిన అరటిచెట్లు


గడిగరేవుల గ్రామంలో మృతి చెందిన గొర్రెలు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని వివిధ మండలాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు చిరు జల్లులు మొదలు కొని ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. నంద్యాల జిల్లాలో 16, కర్నూలు జిల్లాలో 6 మండలాల్లో వర్ష పాతం నమోదైంది. దీంతో ఎండల తీవ్రత కొంత తగ్గింది. కర్నూలు జిల్లా కోసిగిలో 40.9, నంద్యాల జిల్లా గోస్పాడులో అత్యధికంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా.. పత్తికొండలో 18.2, నంద్యాలలో 15.8, పగిడ్యాలలో 11.4, కొలిమిగుండ్లలో 9.2, బండిఆత్మకూరులో 8.6, ఆత్మకూరులో 6.2, గడివేములలో 5.2, మద్దికెరలో 5.2, పాణ్యంలో 4.6, ప్యాపిలిలో 3.8, బగనానపల్లిలో 3.0, ఎమ్మిగనూరులో 2.4, ఆస్పరిలో 1.8, కోడుమూరులో 1.6, వెల్దుర్తిలో 1.1 మి.మీ. ప్రకారం వర్షాలు కురిశాయి. పెనుగాలులతో 33కేవీ పోల్ 1, 11 కేవి పోల్స్ 67, ఎల్‌టీ పోల్స్40, డీటీఆర్ 2 దెబ్బతిని విద్యుత్‌శాఖకు రూ.29.18 కోట్ల నష్టం వాటిల్లింది.

ఈదురు గాలుల బీభత్సం

మహానంది: మండలంలో ఈదురు గా లులు బీభత్సం సృష్టించాయి. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం తెల్లవారుజాము వరకు వీచిన భారీ గాలులకు తిమ్మాపురం, కృష్ణనంది, కడమలకాల్వ, గాజులపల్లె, గోపవరం గ్రామాల్లో సుమారు వంద ఎకరాల్లో అరటిచెట్లు నేలకొరిగినట్లు రైతులు ఉసేని, వెంకటేశ్వర్లు, బాషా, పుల్లయ్య వాపోయారు. విషయం తెలుసుకున్న ఉద్యానశాఖ అధికారి శ్రీధర్, సిబ్బంది పరిశీలించారు. సుమారు వంద ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు.

చల్లబడిన వాతావరణం

కోవెలకుంట్ల/కొత్తపల్లి/పాములపాడు: వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు వేసవి నుంచి ఉపశమనం పొందారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో శనివారం సాయంత్రం ఇరవై నిమిషాల పాటు ఉరుములు, గాలులతో కూడిన వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసి వాతావరణం చల్లబడింది. మేఘావృతమై తిరిగి వర్షం పడటంతో ప్రజలు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బనగానపల్లెలో మోస్తరు వర్షం

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలంలోని ఇల్లూరు కొత్తపేట, నందివర్గం, మిట్టపల్లె, కైప బత్తులూరుపాడు తదితర గ్రామాల్లో కురిసింది. ముఖ్యంగా మండల కేంద్రం బనగానపల్లె పట్టణంలో సాయంత్రం 5 గంటల నుంచి సుమారు 6 గంటల వరకు వర్షం కురింది. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అవుకు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం మోస్తారు మించి వర్షం కురిసింది. రామవరం, మెట్టుపల్లె, గడ్డమేకలపల్లె తదితర గ్రామాల్లో గాలులతో కూడిన వర్షం కురిసింది. అరగంట పాటు వర్షం కురవడంతో ఆయా గ్రామాల్లోని వీధుల్లో వర్షపు నీరు ప్రవహించాయి. గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.


కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

పిడుగుపాటుకు గొర్రెలకాపరి మృతి


పిడుగుపాటుకు మృతి చెందిన గొల్ల శేఖర్

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామ పొలిమేరలోని పొలాలలో గొర్రెలకు కాపాలాగా ఉన్న వ్యక్తిపై పిడుగుపడటంతో మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. వెల్దుర్తి మండలం గుంటుపల్లికి చెందిన గొల్ల శేఖర్ (49) గొర్రెలను గత నెల 13వ తేదీన మేపుకునేందుకు వచ్చాడు. శుక్రవారం అర్ధ రాత్రి భారీగా మెరుపులు రావడంతో పాటు వర్షం పడుతుంటంతో పిడుగుపడింది. దీంతో అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు సంఘటనాస్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతునికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

25 గొర్రెలు మృతి

గడిగరేవుల గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి భారీగా మెరుపులతో పాటు పిడుగుపడింది. దీంతో గ్రామానికి చెందిన చింతల రాముడుకు చెందిన 21, చింతల కృష్ణుడు చెందిన 4 గొర్రెలు మృతి చెందటంతో రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్వో కృష్ణుడు, పశువైద్యాధికారిణి డాక్టర్ పావని సంఘటస్థలాన్ని పరిశీలించి నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

జల్సాల కోసం చోరీల బాట

- ఐదుగురు దొంగల అరెస్ట్
- 29 తులాల బంగారు, 3 కేజీల వెండి, రూ. 3 లక్షల నగదు స్వాధీనం


నిందితులను చూపుతున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల ప్రాంతాల్లో ఎనిమిది ఇళ్లలో చోరీకి పాల్పడిన ఐదుగురు దొంగలను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఆళ్లగడ్డ, కోవెలకుంట్లలోని పోలీసుస్టేషన్ల పరిధిలో గత కొద్ది కాలంగా ఎనిమిది ఇళ్లలో చోరీలు జరిగాయి. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. డీఐజీ సీహెచ్ విజయరావు పర్యవేక్షణలో ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుదీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. అధునాతన సాంకేతికతను ఉపయోగించే దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో కోవెలకుంట్లకు చెందిన ఇజిత్, దుష్యంత్, ఉయ్యాలవాడ మండలం నర్సిపల్లికి చెందిన గుర్రప్ప, సంజామల మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్, కోవెలకుంట్ల మండలం బిజినవేముల గ్రామానికి చెందిన విజయకాంత్‌లు కోవెలకుంట్ల పట్టణంలోని స్కందా ఆర్చ్ వద్ద అనుమానాస్పందంగా తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని విచారించారు. మద్యానికి, జల్సాలకు బానిసై డబ్బు కోసం చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి 29 తులాల బంగారు ఆభరణాలు, 3 కేజీల వెండి వస్తువులు, రూ. 3 లక్షల నగదు, ఒక బైక్, 4 సెల్‌ఫోన్‌లు, రాడ్లు, కట్టర్, సుత్తిలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని పేర్కొన్నారు. కేసు ఛేదనలో ప్రతిభ చూపిన కోవెలకుంట్ల సీఐ జయచంద్ర, ఎస్ఐలు వరప్రసాద్, రాజ్‌కుమార్, సిబ్బంది మాలిక్, రియాజ్, అంజనప్ప, హోమ్‌గార్డులు బాబు, రామయ్య, మహేష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చర్చిలో ప్రచారం

- కోడ్ ఉల్లంఘించిన బీజేపీ అభ్యర్థి


ఇందిరానగర్‌లోని చర్చిలో సమావేశం నిర్వహించి మాట్లాడుతున్న పార్థసారథి

ఆదోని రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ చర్చి(ప్రార్థనా మందిరం)లో శనివారం బీజేపీ అభ్యర్థి పార్థసారథి ఎన్నికల ప్రచారం నిర్వహించి కోడ్‌ను ఉల్లంఘించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఒక మతానికి చెందిన వ్యక్తులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేస్తూ ప్రసంగించారు. ఎన్నికల నిబంధనలను విరుద్ధంగా చర్చిలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన పార్థసారథిపై అధికారులుచర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కోట్ల ఆస్తులు రూ. 22 కోట్లు

డోన్ టౌన్: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి తరపున ఆ పార్టీకి చెందిన చంద్రపల్లె లక్ష్మీనారాయణ యాదవ్ శనివారం నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డికి అందజేశారు. నామినేషన్ పత్రాలతోపాటు సమర్పించిన అఫిడవిట్‌లో సూర్య ప్రకాష్‌రెడ్డికి రూ. 22,06,73,117 ఆస్తులు, రూ.94,90,101 అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. రెండు ఇళ్లు, మూడు కార్లు ఉండగా, ఆయన భార్య కోట్ల సుజాతమ్మ పేరుపై రెండు కార్లు, 40 తులాల బంగారం, చేతిలో రూ.1లక్ష నగదు, బ్యాంక్ అకౌంట్‌లో రూ.28వేలు ఉన్నట్లు పేర్కొన్నారు. కోట్లపై డోన్ పట్టణ పోలీసు స్టేషన్‌లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను ఉల్లంఘించినందుకు ఈనెల 11న క్రైం నెంబర్ 114–2024 కింద నమోదైన కేసు విచారణలో ఉంది.